భూమి కోసమే లగచర్ల లడాయి

- దాడి కేసులో దౌల్తాబాద్ పంచాయతీ కార్యదర్శి రిమాండ్
- కనీసం సంబంధిత శాఖకు సమాచారం ఇవ్వని పోలీసులు
- మూడు రోజుల కిందట సస్పెండ్ చేసిన జిల్లా కలెక్టర్
- 3 నెలల బాబుతో ఎస్టీ కమిషన్ ఎదుటకు రాఘవేందర్ భార్య అఖిల

బీఆర్ఎస్ నాయకుడు సురేశ్ కుట్రపూరితంగా వ్యవహరించి వికారాబాద్ జిల్లా కలెక్టర్, ఇతర అధికారులపై దాడి చేయించాడు. – లగచర్ల ఘటనపై కాంగ్రెస్ ప్రభుత్వ మంత్రులు, పోలీసు ఉన్నతాధికారుల ప్రకటన. సురేష్ బీఆర్ఎస్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అనుచరుడు అనేది వారు చెబుతున్న కారణం.

> లగచర్ల ఘటనలో పోలీసులు రిమాండు చేసిన వారిలో ఓ పంచాయతీ కార్యదర్శి ఉన్నాడు. పేరు రాఘవేందర్. దౌల్తాబాద్ మండలం సంగాయిపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి. మరి... ఇతను ప్రభుత్వ ఉద్యోగి. అంటే దాడి చేసిన వారిలో రాఘవేందర్ ఉన్నాడని పోలీసులే చెబుతున్నందున ఘటన వెనక ప్రభుత్వం ఉందనుకోవాలా? దీనిపై ప్రభుత్వ పెద్దలు ఏమంటారు?! ఇదీ ప్రస్తుతం ప్రతి ఒక్కరూ సంధిస్తున్న ప్రశ్నలు.

హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, నవంబరు 18 (నమస్తే తెలంగాణ): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గం కొడంగల్ పరిధిలో ప్రభుత్వంపై అన్నదాతల తిరుగుబాటును కప్పిపుచ్చుకునేందుకు కాంగ్రెస్ ప్రభుత్వ పెద్దలు బీఆర్ఎస్ పార్టీపై చేస్తున్న ఆరోపణలు బూమరాంగ్ అవుతున్నాయి. ముఖ్యంగా రైతుల ఆగ్రహం, ఆవేదనను వక్రీకరిస్తూ దానిని బీఆర్ఎస్ నేతలపై నెట్టేందుకు శతవిధాలా ప్రయత్నించారు. కానీ ఆదిలోనే ఫోన్‌కాల్స్ వ్యవహారం బెడిసికొట్టగా, పోలీసులు రిమాండు చేసిన వారిలో పంచాయతీ కార్యదర్శి కూడా ఉండటంతో అమాయక రైతులు తమ భూములు కాపాడుకునేందుకే లగచర్ల లడాయికి దిగారే తప్ప దీని వెనక ఎవరి కుట్రలేదనేది మరోసారి రుజువైంది. రిమాండు రిపోర్టులో పంచాయతీ కార్యదర్శి పేరును పోలీసులు ప్రస్తావించినప్పటికీ.. ఆ సమయంలో సంబంధిత శాఖకు కనీస సమాచారం ఇవ్వకపోవడం ఒకవంతైతే, పోలీసు ఉన్నతాధికారులు మీడియా ముందు మాట్లాడిన సమయంలో రైతుల్లో ప్రభుత్వ ఉద్యోగి కూడా ఉన్నాడనే విషయాన్ని మాత్రం ఎక్కడా ప్రస్తావించకపోవడం గమనార్హం. సదరు పంచాయతీ కార్యదర్శి రాఘవేందర్ ఉద్యోగ రీత్యా దౌల్తాబాద్ మండలం సంగాయిపల్లిలో పని చేస్తున్నారు. వాస్తవానికి ఆయనది దుద్యాల మండలం లగచర్ల గ్రామం. రాఘవేందర్‌కు రెండెకరాల భూమి ఉన్నట్టు తెలిసింది. భూసేకరణలో రాఘవేందర్ భూమి కూడా పోతున్నట్టు తెలిసింది. పోలీసులు రిమాండు రిపోర్టులో ఎ–26గా రాఘవేందర్ పేరు చేర్చారు. ఈ మేరకు తొలి విడతలోనే 16 మందిని రిమాండు చేశారు. పోలీసు ఉన్నతాధికారులు అనేకసార్లు మీడియాతో మాట్లాడారు. కానీ ఎక్కడా ప్రభుత్వ ఉద్యోగి ఉన్నాడనే విషయాన్ని మాత్రం వెల్లడించలేదు. బీఆర్ఎస్ నేత సురేశ్ ఈ ఘటనకు సూత్రధారి అంటూ పలుసార్లు చెప్పారు. అదేరీతిలో మంత్రులు, ఇతర కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు సురేశ్ పేరు ప్రస్తావించి బీఆర్ఎస్‌పై రాజకీయ దాడి చేశారు. కానీ ఒక ప్రభుత్వ ఉద్యోగి దాడి ఘటనలో ఉన్నారని స్వయానా పోలీసులే చెబుతున్నందున ఇది రాజకీయ ప్రేరేపిత దాడి కాదనేది స్పష్టమవుతుంది. ప్రభుత్వ ఉద్యోగిని రిమాండు చేసే సమయంలో కచ్చితంగా పోలీసులు ఆయన పని చేసే శాఖకు సమాచారం ఇవ్వాలని పలువురు సీనియర్ అధికారులు చెబుతున్నారు. రిమాండు చేసిన కొన్ని రోజుల తర్వాత శనివారం తమకు సమాచారం ఇచ్చారని, రాఘవేందర్‌ను సస్పెండ్ చేసేందుకు ప్రతిపాదనలు కలెక్టర్‌కు పంపినట్టు వికారాబాద్ డీపీవో చెబుతున్నారు. అందుకు అనుగుణంగా శనివారమే జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ పంచాయతీ కార్యదర్శి రాఘవేందర్‌ను సస్పెండ్ చేసినట్టు తెలిపారు.

జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడి ముందు గోడువెల్లబోసుకుంటున్న బాధితురాలు అఖిల

రాఘవేందర్, పంచాయతీ కార్యదర్శి

పసికందుతో జాతీయ ఎస్టీ కమిషన్ ముందుకు...

లగచర్ల ఘటనలో తొమ్మిది నెలల నిండు గర్భిణీ జ్యోతి గాధ ప్రతిఒక్కరినీ కదిలిస్తుండగా... తాజాగా సస్పెండ్ అయిన పంచాయతీ కార్యదర్శి రాఘవేందర్ భార్య అఖిల పరిస్థితి కూడా అందరినీ కలిచివేస్తుంది. ఆ కుటుంబానికి ఉన్న రెండెకరాల భూమి ఫార్మా కంపెనీలో పోతుందనే బాధ ఒకవైపు... దాడి ఘటనలో పోలీసులు తన భర్తను జైలుకు పంపిన వేదన మరోవైపు... దాడిలో పాల్గొన్నాడని కలెక్టర్ ప్రతీక్‌జైన్ రాఘవేందర్‌ను ఉద్యోగం నుంచి సస్పెండ్ చేయడం ఇంకోవైపు... ఇన్ని బాధల మధ్య రాఘవేందర్ భార్య అఖిల లగచర్లలో సోమవారం జాతీయ ఎస్టీ కమిషన్ ముందు తన గోడు వెల్లబోసుకునేందుకు 3 నెలల పసికందుతో వచ్చారు. జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు హుస్సేన్‌కు తన ఆవేదన వెల్లడించగా... తప్పకుండా న్యాయం చేస్తానని ఆయన హామీ ఇచ్చారు.

నా భర్త అరెస్టు అక్రమం

నా భర్త రాఘవేందర్‌ను అక్రమంగా అరెస్టు చేశారు. దాడితో ఆయనకు ఎలాంటి సంబంధం లేదు. ఏనాడూ ఎలాంటి గొడవలకు పోడు. సంఘటన జరిగిన రోజు ఆయన సంగాయిపల్లిలో సర్వే పనులు నిర్వహించి రాత్రి ఇంటికి వచ్చాడు. పోలీసులు రాత్రి ఇంటిలో చొరబడి ఎంత చెప్పినా వినకుండా అరెస్టు చేశారు. కలెక్టర్ మీద దాడికి పోతడా? అని రెండు రోజుల కిందట సస్పెండ్ చేసినట్టు ఉత్వర్వులు ఇచ్చినరు. భూమి పోతున్నంత మాత్రాన సంబంధం ఉందని అరెస్టు చేయడం ఎంతవరకు సమంజసం? ప్రభుత్వ ఉద్యోగిని ఎటువంటి ఆధారాలు లేకుండా అరెస్టు చేస్తరా? ఎట్ల సస్పెండ్ చేస్తరు? సంటి పిల్లను పెట్టుకొని ఎవరికి చెప్పుకోవాల్నో అర్థమైతలేదు. నా భర్తను వెంటనే విడుదల చేయాలి.

- అఖిల

లగచర్ల రైతులను విడుదల చేయాలి

- ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు నర్సింహ

కందుకూరు, నవంబర్ 18: లగచర్ల ఘటనలో గిరిజనులపై పెట్టిన కేసులను తక్షణమే ఎత్తివేయాలని, జైలు నుంచి విడుదల చేయాలని ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ సభ్యులు చిలకమర్రి నర్సింహ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రంగారెడ్డి జిల్లా కందుకూరులో సోమవారం ఆయన మాట్లాడారు. అమాయక గిరిజనులపై ప్రభుత్వం కేసులు పట్టి వేధిస్తున్నదని ఆరోపించారు. ప్రభుత్వం తమ భూములను లాక్కుంటే జీవనోపాధి కోల్పోతామనే భయంతోనే గిరిజనులు అధికారులకు అడ్డుపడ్డారని తెలిపారు. కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు రైతుల ముసుగులో గిరిజనులను రెచ్చగొట్టి అధికారులపై చట్టవ్యతిరేకంగా ఉసిగొల్పారని ఆరోపించారు. పోలీసులు రాత్రి వేళ ఇండ్లల్లోకి వెళ్లి అరెస్టు చేసి గిరిజనులపై థర్డ్ డిగ్రీ ప్రయోగించారని పేర్కొన్నారు. పేదల భూములను సేకరించే పక్రియను ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని సూచించారు. అక్కడ ఎట్టి పరిస్థితుల్లో ఫార్మా కంపెనీలు ఏర్పాటు చేయొద్దని హితవు పలికారు.

లగచర్ల రైతు సురేశ్‌పై లుకౌట్ నోటీస్

హైదరాబాద్, నవంబర్ 18 (నమస్తే తెలంగాణ): లగచర్ల రైతుల తిరుగుబాటు కేసులో ప్రధాన నిందితుడిగా భావిస్తున్న బాధిత రైతు సురేశ్ కోసం పోలీసులు గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. ఈ మేరకు సోమవారం అతనిపై పోలీస్‌శాఖ లుకౌట్ నోటీస్ జారీచేసింది. సురేశ్ దొరికితే అతని ద్వారా ఏమైనా నిజాలు వస్తాయోమోనని పోలీసులు భావిస్తున్నారు. ఒకవైపు జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు లగచర్లలో పర్యటించి అక్కడి దారుణ పరిస్థితులను మీడియాకు వివరించారు. దీనికితోడు తమ గోడు వెలిబుచ్చేందుకు లగచర్ల బాధిత గిరిజన రైతు కుటుంబాలు ఢిల్లీకి వెళ్లిన నేపథ్యంలో పోలీస్ శాఖ దర్యాప్తును ముమ్మరం చేసింది. ఇప్పటికే తిరుగుబాటు చేసిన 25 మంది రైతులను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించింది కొత్తగా ఎవరినీ అరెస్టు చేయొద్దని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ ఆదేశించడంతో పోలీస్ శాఖ డైలమాలో పడింది.

వరంగల్ జిల్లా రాయపర్తిలో జాతీయ రహదారిపై గిరిజనులు, బీఆర్ఎస్ శ్రేణుల ఆధ్వర్యంలో చేపట్టిన రాస్తారోకోలో పాల్గొన్న మాజీ మంత్రి ఎర్రబెల్లి

బంధువుల కోసమే గిరిజనులపై లాఠీ

- సీఎం రేవంత్‌పై మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ ఫైర్
- రాయపర్తిలో బీఆర్ఎస్ శ్రేణుల రాస్తారోకో

రాయపర్తి, నవంబర్ 18 : ఫార్మా కంపెనీల పేరుతో సీఎం రేవంత్‌రెడ్డి లగచర్ల గిరిజనులపై దాడులకు పాల్పడుతున్నాడని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆరోపించారు. కొడంగల్ నియోజకవర్గంలోని లగచర్లలో గిరిజనులపై పోలీసుల దమనకాండ, అక్రమ కేసుల బనాయింపును నిరసిస్తూ వరంగల్ జిల్లా రాయపర్తి లోని వరంగల్–ఖమ్మం జాతీయ రహదారిపై బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సోమవారం గిరిజనులు, పార్టీ శ్రేణులతో కలిసి రాస్తారోకో నిర్వహించారు. మహబూబాబాద్ మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్‌తో కలిసి ఎర్రబెల్లి హాజరై మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వం హైదరాబాద్‌కు అతి చేరువలో ఫార్మా సిటీ కోసం భూసేకరణ జరిపి ల్యాండ్ బ్యాంక్‌ను ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తుచేశారు. అయితే సీఎం రేవంత్‌రెడ్డి తన సోదరులు, వియ్యంకుడు, అల్లుడు, బంధువులకు మేలు చేయడం కోసమే లగచర్ల గిరిజనులపై పోలీసులతో అక్రమ కేసులు పెట్టారని మండిపడ్డారు. ప్రభుత్వం ఏం సాధించిందని వరంగల్‌లో ప్రజాపాలన విజయోత్సవ సభ నిర్వహిస్తున్నదో చెప్పాలని డిమాండ్ చేశారు.

పాలకుర్తిలో బీఆర్ఎస్ రాస్తారోకో

పాలకుర్తి: ఫార్మా కంపెనీల పేరుతో గిరిజనుల భూములను లాక్కోవాలని చూస్తున్న సీఎం రేవంత్‌రెడ్డికి గిరిజనుల చేతిలో పరాభవం తప్పదని ఓయూ జేఏసీ ప్రధాన కార్యదర్శి భూకా రాజేశ్‌నాయక్ హెచ్చరించారు. సోమవారం జీసీసీ మాజీ చైర్మన్ ధరావత్ మోహన్‌గాంధీనాయక్, మాజీ జడ్పీటీసీ పుస్కూరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గిరిజనులతో కలిసి జనగామ జిల్లా పాలకుర్తిలో రాస్తారోకో చేపట్టారు. రాజేశ్‌నాయక్ మాట్లాడుతూ ప్రజాభిప్రాయ సేకరణ పేరుతో అధికారులు గిరిజనులపై దాడులకు పాల్పడటం తగదన్నారు.

లగచర్ల గిరిజనుల అరెస్ట్‌కు నిరసనగా జనగామ జిల్లా పాలకుర్తిలోని రాజీవ్ చౌరస్తాలో రాస్తారోకో చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

కొడంగల్ వెళ్లకుండా ముందస్తు అరెస్టులు

న్యూస్ నెట్‌వర్క్, నవంబర్ 18 : 'చలో కొడంగల్'కు గిరిజన సంఘాలు పిలుపునిచ్చిన నేపథ్యంలో ఆయా చోట్ల పోలీసులు గిరిజన సంఘాలు, బీఆర్ఎస్ నాయకులను ముందస్తు అరెస్ట్ చేశారు. సోమవారం మహబూబాబాద్‌లో పోలీసులు లంబాడా హక్కుల పోరాట సమితి నాయకులను ముందస్తు అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఎల్ హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు భీమానాయక్ మాట్లాడుతూ అక్రమ అరెస్ట్‌లతో గిరిజనుల ఉద్యమాన్ని ఆపలేరని హెచ్చరించారు. గిరిజన విద్యార్థి సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బాలాజీనాయక్, భారతీయ గోర్ బంజారా పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు రవిచందర్ చౌహాన్‌ను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చండ్రుగొండ పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు ధరావత్ సురేశ్‌ను టేకులపల్లి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల్లో ఆదివారం అర్ధరాత్రి, సోమవారం ఉదయం బీఆర్ఎస్ నాయకులను ముందస్తుగా అరెస్టు చేశారు. లగచర్లలో గిరిజనుల అరెస్టుకు నిరసనగా 'చలో కొడంగల్' కార్యక్రమానికి వెళ్తుండగా ఠాణాకు తరలించారు. నిర్మల్ జిల్లా పెంబీ మండలంలో లంబాడా హక్కుల పోరాట సమితి నాయకులు, బీఆర్ఎస్ నాయకులను అరెస్టు చేశారు. ఆదిలాబాద్ జిల్లా నార్నూర్, గాదిగూడ మండలాల పరిధిలోని పోలీస్‌స్టేషన్‌కు.. ఇంద్రవెల్లి మండలంలో బీఆర్ఎస్ నాయకులను, గుడిహత్నూర్‌లో బీఆర్ఎస్ నాయకులు పోలీసులు అరెస్టు చేశారు.

మహబూబాబాద్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి. చిత్రంలో ఎమ్మెల్సీ రవీందర్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు రెడ్యానాయక్, శంకర్‌నాయక్

రేపు మానుకోటలో గిరిజన రైతులతో ధర్నా

- హాజరుకానున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- ఎమ్మెల్సీలు పోచంపల్లి, తక్కళ్లపల్లి

మహబూబాబాద్ రూరల్, నవంబర్ 18 : లగచర్ల ఘటన, గిరిజన సమస్యలు, ఎన్నికల హామీలను అమలు చేయాలని గిరిజన రైతుల కోరిక మేరకు ఈ నెల 20న మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో 15 వేల మంది రైతులతో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్సీలు పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, తక్కళ్లపల్లి రవీందర్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు రెడ్యా నాయక్, బానోతు శంకర్‌నాయక్ తెలిపారు. సోమవారం మహబూబాబాద్‌లోని పీఎస్ఆర్ కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో వారు మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి లంబాడా ఓట్లు కావాల్సి వచ్చిందని, అధికారంలోకి వచ్చాక రేవంత్‌రెడ్డి వారిని అణచివేసే కుట్ర చేస్తున్నారని మండిపడ్డారు. సీఎం రేవంత్‌రెడ్డి తన సొంత ప్రయోజనం కోసమే కొడంగల్ నియోజకవర్గం లగచర్లలో ఫార్మా కంపెనీ పెడుతున్నారని ఆరోపించారు. ఈ కంపెనీ కోసం సుమారు 4 వేల ఎకరాల భూమిని సేకరించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని చెప్పారు. ఇందులో అమాయక, పేద గిరిజనుల భూములను ప్రభుత్వం లాక్కొనే కుట్ర చేస్తున్నదని మండిపడ్డారు.

పట్నం బెయిల్ పిటిషన్ 25కు వాయిదా

వికారాబాద్, నవంబర్ 18 (నమస్తే తెలంగాణ): లగచర్ల ఘటనలో రిమాండ్ అయిన కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి బెయిల్ పిటిషన్ ఈనెల 25కు వాయిదా పడింది. వికారాబాద్ జిల్లా కోర్టులో బెయిల్ పిటిషన్‌పై వాదనలు విన్న న్యాయమూర్తి బెయిల్ పిటిషన్‌పై నిర్ణయాన్ని వచ్చే సోమవారానికి వాయిదా వేశారు. మరోవైపు లగచర్ల ఘటన అనంతరం ఈనెల 13న హైదరాబాద్‌లో అదుపులోకి తీసుకున్న పోలీసులు సాయంత్రం వరకు విచారించి, ఆ తరువాత కొడంగల్ కోర్టులో హాజరుపర్చగా 14 రోజుల రిమాండ్ విధించిన విషయం తెలిసిందే.

పట్నం తరపున అఫిడవిట్ దాఖలు

నాంపల్లి క్రిమినల్ కోర్టులు, నవంబర్ 18 (నమస్తే తెలంగాణ): మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి తరపున కొడంగల్ జేఎఫ్‌సీఎం కోర్టులో సోమవారం న్యాయవాదులు అఫిడవిట్ దాఖలు చేశారు. వాకింగ్ చేస్తున్న సమయంలో పోలీసులు తనను బలవంతంగా అరెస్టు చేశారని నరేందర్‌రెడ్డి తన అఫిడవిట్‌లో పేర్కొన్నారు. బొంరాస్‌పేట్ పోలీసులు తననుంచి ఎలాంటి స్టేట్‌మెంట్ రికార్డు చేయలేదని, తన వాంగ్మూలాన్ని నమోదు చేసినట్టు చిత్రీకరించారని తెలిపారు.

పరిగి డీఎస్పీ బదిలీ

పరిగి : పరిగి డీఎస్పీ కరుణసాగర్‌రెడ్డి బదిలీ అయ్యారు. ఆయన్ను డీజీపీ కార్యాలయానికి అటాచ్ చేస్తూ డీజీపీ జితేందర్ ఉత్తర్వులు జారీ చేశారని ఎస్పీ కే నారాయణరెడ్డి తెలిపారు. ఆయన స్థానంలో పరిగి డీఎస్పీగా శ్రీనివాస్ నియమితులయ్యారు.

అప్రజాస్వామికంగా భూసేకరణ

- నాడు వ్యతిరేకించిన సీఎం.. నేడు బలవంతంగా లాక్కుంటున్నారు
- విదేశీ సంస్థలకు భూములిచ్చేందుకే ఫార్మా కంపెనీల ఏర్పాటు
- లగచర్ల గ్రామాన్ని జైలుగా మార్చి.. భయభ్రాంతులకు గురిచేస్తున్నారు
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం విమర్శ

మీడియాతో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని. పక్కన జూలకంటి, వీరయ్య

హైదరాబాద్, నవంబర్ 18 (నమస్తే తెలంగాణ): రైతులు, ప్రజలకు నష్టం జరగకుండా పరిశ్రమల ఏర్పాటుకు భూ సేకరణ చేయాలని, ఫార్మా కంపెనీల కోసం భూసేకరణ జరపడం అప్రజాస్వామికమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం పేర్కొన్నారు. వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గం లగచర్లలో జరుగుతున్న పరిణామాలు దురదృష్టకరమని ఆవేదన వ్యక్తంచేశారు. సీపీఎం రాష్ట్ర కార్యాలయంలో సోమవారం పార్టీ నేతలు జూలకంటి రంగారెడ్డి, ఎస్ వీరయ్యతో కలిసి తమ్మినేని మీడియాతో మాట్లాడారు. లగచర్లలో భూసేకరణ విషయంలో ప్రభుత్వం ప్రజాస్వామికంగా వ్యవహరించలేదని విమర్శించారు. గతంలో ఫార్మా సిటీని వ్యతిరేకించిన సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ.. ఇప్పుడు లగచర్లలో భూ సేకరణ జరపడం ఏమిటని ప్రశ్నించారు.

విదేశీ సంస్థలకు అప్పగించేందుకే ఫోర్త్ సిటీనా?

గతంలో రంగారెడ్డి జిల్లాలో ఫార్మా సిటీ కోసం 15 వేల ఎకరాలు సేకరించారని తమ్మినేని వీరభద్రం గుర్తుచేశారు. ఆ ఫార్మా సిటీని రద్దు చేస్తామన్న సీఎం రేవంత్‌రెడ్డి.. ఇప్పుడు లగచర్లలో ఫోర్త్‌సిటీ పేరుతో రైతుల నుంచి భూములను బలవంతంగా తీసుకోవడం తగదని పేర్కొన్నారు. విదేశీ కంపెనీల ద్వారా ఫార్మా కంపెనీ ఏర్పాటు చేస్తామని చెప్పడం విదేశీ కంపెనీలకు భూములు అప్పగించడమేనని ఆరోపించారు. ఫార్మా కంపెనీ ఏర్పాటుకు తమ భూములను తీసుకుంటే జీవనోపాధి కోల్పోతామని ఆవేదనతో ఉన్న రైతులను.. కలెక్టర్‌పై దాడి నెపంతో అరెస్ట్ చేసి జైల్లో పెట్టడం దారుణం అని తమ్మినేని విమర్శించారు. నిర్బంధాలతో గ్రామాన్ని జైలుగా మార్చి ప్రజలను, రైతులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. గతంలో నిర్బంధాలు విధించిన వాళ్లు రాజకీయంగా ఏమయ్యారో గుర్తు పెట్టుకోవాలని హెచ్చరించారు. లగచర్ల ఘటనలో వాస్తవాలను తెలుసుకొనేందుకు ఈ నెల 21న సీపీఎం ఆధ్వర్యంలో వామపక్ష పార్టీల నేతలు, ప్రజాసంఘాలు గ్రామాన్ని సందర్శించనున్నట్టు తమ్మినేని తెలిపారు.

సిమెంట్ ఫ్యాక్టరీ నిర్మాణాన్ని అడ్డుకుంటాం: జూలకంటి

హైదరాబాద్, నవంబర్ 18 (నమస్తే తెలంగాణ): ఉమ్మడి నల్లగొండ జిల్లా రామన్నపేటలో సిమెంట్ ఫ్యాక్టరీ నిర్మాణాన్ని అడ్డుకుంటామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి తెలిపారు. ఇప్పటికే దీనిపై జరిగిన ప్రజాభిప్రాయ సేకరణలో ప్రజలు, రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు ఫ్యాక్టరీ ఏర్పాటును వ్యతిరేకించినట్టు చెప్పారు. ప్రభుత్వం పరిశ్రమలు ఏర్పాటు చేయడానికి సీపీఎం వ్యతిరేకం కాదని, ప్రజలకు, రైతులకు ఇబ్బంది, నష్టం జరగని ప్రాంతాల్లో ఏర్పాటుచేయాలని సూచించారు.

మూసీ సుందరీకరణ వేరు, ప్రక్షాళన వేరు : ఎస్ వీరయ్య

హైదరాబాద్, నవంబర్ 18 (నమస్తే తెలంగాణ): మూసీ పక్షాళన చేయాలంటే ఇరువైపుల ఉన్న 12 వేల ఇండ్లను కూల్చాల్సిన అవసరం లేదని, మూసీకి రెండు వైపులా ఎత్తుగా గోడలు కడితే సరిపోతుందని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎస్ వీరయ్య సూచించారు. మూసీ నిర్వాసితులకు ముందుగా ప్రభుత్వం ఇండ్లను నిర్మించి, నష్టపరిహారం చెల్లించిన తర్వాతనే వారిని అక్కడి నుంచి తరలించాలని డిమాండ్ చేశారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టు నిర్మాణం సందర్భంగా నిర్వాసితులైన లంబాడీ గిరిజనులు ఇప్పటికీ పునరావాసాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వీరయ్య గుర్తుచేశారు.

ఓయూలోని ఆర్ట్స్ కళాశాల ముందు సమావేశమైన వివిధ సంఘాల నాయకులు

రేపు లగచర్లకు నిజనిర్ధారణ కమిటీ

- సేవాలాల్ సేన జాతీయ అధ్యక్షుడు సంజీవనాయక్
- వివిధ గిరిజన సంఘాల సమావేశంలో తీర్మానం

సికింద్రాబాద్, నవంబర్18: లగచర్ల ఘటనపై వాస్తవాలను తెలుసుకునేందుకు బుధవారం గ్రామంలో నిజ నిర్ధారణ కమిటీ పర్యటిస్తుందని సేవాలాల్ సేన జాతీయ అధ్యక్షుడు భూక్య సంజీవనాయక్ తెలిపారు. సోమవారం హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీలోని ఆర్ట్స్ కళాశాల సమీపంలో జరిగిన వివిధ గిరిజన సంఘాల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కమిటీ గ్రామంలో పర్యటించి, వాస్తవ విషయాలను సేకరించి ప్రభుత్వానికి నివేదిక అందించాలని కోరుతూ ఈ సమావేశంలో తీర్మానించామని తెలిపారు. ఈ కమిటీలో మేధావులు ఉంటారని తెలిపారు. లగచర్లలో అధికారులపై దాడి అనంతరం గిరిజనులను అర్ధరాత్రి అక్రమంగా అరెస్టు చేసి, కొందరి అరెస్టు చూపకుండా ఇబ్బందులు పెడుతున్నట్టు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. సమావేశంలో రిటైర్డ్ ప్రొఫెసర్, ఆలిండియా బంజారా ప్రొఫెసర్ల సేవా సంఘం అధ్యక్షుడు చంద్రునాయక్, స్టార్స్ టీం అధ్యక్షుడు డాక్టర్ కొర్ర ఈశ్వర్‌లాల్, నిరుద్యోగ జేఏసీ నేత మోతీలాల్, బీఆర్ఎస్వీ విద్యార్థి విభాగ కార్యదర్శి శ్రీను నాయక్, రాజు రాథోడ్, వినోద్‌నాయక్, నవీన్, జాదవ్‌నాయక్, నవీన్ నాయక్, ప్రవీణ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

భూసేకరణ ప్రక్రియ నిలిపివేయాలి

- రైతులను బేషరతుగా విడుదల చేయాలి
- సేవాలాల్ సేన గ్రేటర్ అధ్యక్షుడు కల్యాణ్‌నాయక్

కల్యాణ్ నాయక్‌ను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

చిక్కడపల్లి, నవంబర్18: లగచర్ల రైతుల హక్కుల కోసం గిరిజనులను ఏకం చేసి ఐక్య ఉద్యమాన్ని చేపడుతామని సేవాలాల్ సేన గ్రేటర్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు వడ్త్యా కల్యాణ్‌నాయక్ స్పష్టం చేశారు. లగచర్ల రైతులపై మోపిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేసి, బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఫార్మా భూముల అక్రమ సేకరణ ఆపాల్సిందేనని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గిరిజనుల పక్షాన శాంతియుతంగా సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి వినతిపత్రం ఇవ్వడానికి సేవాలాల్ సేన పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో కల్యాణ్‌నాయక్‌ను ఆదివారం అర్ధరాత్రి చిక్కడపల్లి పోలీసులు అరెస్ట్ చేశారు.

రేవంత్‌రెడ్డిది నియంత పాలన

- బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్

కంది, నవంబర్ 18: రాష్ట్రంలో నియంతృత్వం, అహంకార పాలన కొనసాగుతున్నదని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. నియంత పాలనకు ప్రజలు తగిన బుద్ధి చెప్పడం ఖాయమని హెచ్చరించారు. సంగారెడ్డి జిల్లా కంది జైలులో ఉన్న లగచర్ల బాధితులను ఎంపీ డీకే అరుణతో కలిసి సోమవారం ఆయన పరామర్శించారు. అనంతరం ఈటల మీడియాతో మాట్లాడారు. లగచర్ల ఘటనకు స్కెచ్ వేసింది కాంగ్రెస్ పార్టీయేనని ఆరోపించారు. లగచర్ల బాధితులకు ప్రభుత్వం క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రైతులకు సంకెళ్లు వేయడం, థర్డ్ డిగ్రీ చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.బాధితులను విడుదల చేయాలన్నారు. ఎంపీ డీకే అరుణ మాట్లాడుతూ సీఎం సొంత నియోజకవర్గంలో ఇలాంటి ఘటనలకు పాల్పడటం సిగ్గుచేటని అన్నారు. ఓట్లేసిన ప్రజల కంటే ఫార్మా కంపెనీలపై ప్రేమేందుకని ప్రశ్నించారు.

రుద్రంగిలో ఏటీసీకి గ్రీన్‌సిగ్నల్

హైదరాబాద్, నవంబర్ 18(నమస్తే తెలంగాణ): రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ డివిజన్ పరిధిలోని రుద్రంగిలో నూతనంగా అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ) ఏర్పాటుకు గ్రీన్‌సిగ్నల్ ఇస్తూ సోమవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. స్థానికంగా సాంకేతిక నైపుణ